క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాలటౌన్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు 9959225800 నంబర్‌కు కాల్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

శిరివెళ్ల: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన సాంబ (45) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కార్యవర్గ సభ్యుడు లక్కాలకుల చంద్ర బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

అభయాంజనేయస్వామికి విశేష పూజలు

ఉయ్యాలవాడ: మాఘ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామంలో వెలిసిన అభయాంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. క్షీరాభిషేకం, కుంకుమార్చన, నవగ్రహ పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తుడుమలదిన్నెలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఉయ్యాలవాడ: గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి అశోక్ అన్నారు. మంగళవారం ఉయ్యాలవాడ మండలం తుడుమల దిన్నె గ్రామంలో మాయలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అశోక్, వైద్య సిబ్బంది 104 వాహనంలో స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. సాయంత్రం అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు, గృహాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వివిధ పరీక్షలు చేశారు. ఆరోగ్య జాగ్రత్తలను తెలియజేశారు.

వేడుకగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



పూజలందుకున్న శ్రీకాళికాంబ అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లోని శ్రీకాళికాంబ చంద్ర శేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతం, నిమ్మ, వేప రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ చేశారు. మహా మంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపు నందికొట్కూరులో మినీ జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థఆధ్వర్యంలో నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 29న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి ప్రతాపరెడ్డి తెలిపారు. గరుడ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్, అవివోమ్ ఇండియా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, గ్రీన్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 5వ తరగతి, పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమో పూర్తి చేసిన 18-35 ఏళ్ల యువతీయువకులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరుకావాలన్నారు. సమాచారం కోసం 9440224291 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. నంద్యాలలో 29న జరిగే జాబ్‌మేళా వాయిదా పడినట్లు తెలిపారు.

న్యూసెన్స్ కేసులో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): న్యూసెన్స్ కేసులో నిందితుడికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి మంగళవారం 7 రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని తెలుగుపేటకు చెందిన మిద్దె రఘు కల్పనా సెంటర్‌లోని బహిరంగ ప్రదేశంలో న్యూసెన్స్ చేస్తుండగా స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా శిక్ష ఖరారు చేసినట్లు తెలిపారు.

కష్టపడితే విజయం తథ్యం

నంద్యాల(న్యూటౌన్): కష్టపడితే విజయం తప్పకుండా వరిస్తుందని.. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత కేశవరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి నంద్యాల బాలాజీ కాంప్లెక్స్‌లోని పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలన్నారు.

విజ్ఞానం.. వికాసం

మానవ జీవితం సైన్స్‌తో ముడిపడి నడుస్తోంది. విజ్ఞానం మానవ ప్రగతికి ఎంతో ఆధారం. దాన్ని అందిపుచ్చుకున్నప్పుడే మనుగడ సాధ్యం. విద్యార్థుల్లో సైన్స్‌పై మక్కువ పెంచేందుకు, వారిలో దాగివున్న ప్రతిభను గుర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ఏటా పాఠశాల స్థాయి నుంచి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రదర్శనల్లో సత్తా చాటుతున్నారు. నేడు జాతీయ సైన్స్ దినోత్సవం.

- నేడు జాతీయ సైన్స్ దినోత్సవం
- ఇన్‌స్పైర్ మనక్, సైన్స్ ఫెయిర్‌లలో విద్యార్థుల ప్రతిభ
- కొత్త ఆవిష్కరణల ప్రదర్శన
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ముందంజ



యాళ్లూరు హైస్కూల్‌లో ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గోస్పాడు: ప్రకృతిలో జరుగుతున్న ప్రతి విషయం వెనుక శాస్త్రీయత దాగిఉంటుంది. పరిశీలన, ప్రయోగాల ద్వారా దాన్ని నిరూపించవచ్చు. అలాగే మానవుని జీవితాన్ని సరళీకృతం చేసేందుకు నూతన ఆవిష్కరణలు అవసరం. అయితే వాటి ఆవిష్కరణలకు సరైన ప్రోత్సాహం, వేదిక అవసరం. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో సైన్స్ విజ్ఞానాన్ని పెంపొందించేలా పాఠశాలలను తీర్చిదిద్దింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు సైన్స్ పరికరాలను అందిస్తూ, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధన అమలు చేస్తోంది. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలను వృద్ధి చేసుకునేలా, సైన్స్ పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా పాఠశాలల్లో ఏటా సైన్స్ ఫెయిర్‌లు నిర్వహిస్తోంది. విద్యార్థులతో పలు రకాల ప్రాజెక్టులను నిర్వహించేలా చేస్తోంది. విద్యార్థులు పరిశీలనాత్మక దృష్టితో పలు రకాల ప్రాజెక్టులను రూపకల్పన చేసి వాటిని పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శిస్తూ ప్రతిభ చాటుకుంటున్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యత

సీవీ రామన్ (చంద్రశేఖర వెంకట రామన్) పేరుగాంచిన భౌతిక శాస్త్రవేత్త. నోబెల్ పురస్కార గ్రహీత. ఈయన 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్ కనుగొన్నారు. భౌతిక శాస్త్రంలో రామన్ చేసిన అపారమైన సేవలకు గుర్తుగా ఆ రోజున జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుతున్నారు. ప్రజల రోజువారి జీవితంలో సైన్స్ ప్రాముఖ్యత, సందేశాన్ని వ్యాప్తి చేయడానికి, సైన్స్ రంగం అభివృద్ధి చేయడానికి, కొత్త సాంకేతికతను అమలు చేయడానికి, శాస్త్రీయ దృక్పథం గల పౌరులకు అవకాశం కల్పించి, సైన్సు అండ్ టెక్నాలజీని ప్రాచుర్యంలోకి తీసుకువచ్చేలా పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని కలిగించాలన్నది జాతీయ సైన్స్ దినోత్సవ ఉద్దేశం.

జాతీయ ఇన్‌స్పైర్ మనక్ నేపథ్యం

కేంద్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఏటా ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పరిశోధనలపై ఆసక్తి పెంచేందుకు విద్యార్థులు స్వయంగా సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన చేసుకునేందుకు ఉపకార వేతనాలను ఇస్తోంది. ఫిబ్రవరి నెలలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శన జరిగింది.

విద్యార్థుల్లో పరిశీలనాత్మక దృష్టి పెంపొందుతుంది

విద్యార్థులను బాల మేధావులుగా మార్చడానికి, పిల్లల్లో పరిశీలనాత్మక దృష్టి పెంపొందేందుకు సైన్స్ ఫెయిర్‌లు ఉపయోగపడుతాయి. పాఠశాల స్థాయి నుంచే ప్రాజెక్టుల రూపంలో, సామాజిక, పరిసరాల్లోని సమస్యలను గుర్తించి వాటికి తగిన పరిష్కారాలు అన్వేషించి రూపకల్పన ద్వారా ప్రజల ముందుకు తీసుకొని రావడమే సైన్స్ లక్ష్యం. పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు, ప్రతిభను గుర్తించేందుకు అవకాశం ఉంటుంది.

–సుందర్‌రావు, జిల్లా సైన్స్ అధికారి

రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను



చీకటిలో వెలుతురు ప్రసరింపజేయడం ఎలా అనే ప్రాజెక్టుపై రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యాను. జనవరిలో కడపలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో భాగంగా ప్రాజెక్టును ప్రదర్శించాను. రాత్రి సమయాల్లో రోడ్లపై చీకటి ఎక్కువగా ఉంటుంది. లైట్ డిఫెన్స్ రిజిస్టర్ సెన్సార్‌ను ఉపయోగించి వెలుతురును ప్రసరింపచేయవచ్చు. దీంతో రహదారి సక్రమంగా కనిపిస్తూ ప్రమాదాలు నివారించేందుకు వీలు అవుతుంది. చీకటి ఉన్న సమయంలో లైట్లు వెలిగి వెలుతురు రావడం, వెలుతురు ఉన్న సమయంలో లైట్లు ఆఫ్ అయి చీకటిగా మారుతుంది.

–కరీమూన్, 8వ తరగతి, కేజీబీవీ, శిరివెళ్ల

ఇన్‌స్పైర్ మనక్ స్కీంకు ఎంపికయ్యా



వ్యర్థ నీటిని ఉపయోగించడం, నీటిని ఆదా చేయడం ఎలా అనే ప్రాజెక్టును చేసేందుకు ఇన్‌స్పైర్ మనక్ స్కీమ్‌కు ఎంపికయ్యా. ఈ నెల ప్రాజెక్టుకు సంబంధించి నంద్యాలలో ప్రదర్శన ఇవ్వడంతో జిల్లాకు ఎంపికయ్యా. నిత్య జీవితంలో నీటికి ఎంతో ప్రాధాన్యత ఉంది. వ్యర్థపు నీటిని ఎలా ఉపయోగించాలి, పొదుపు చేయాలో ఉపయోగించే విధానంపై వివరించా. సేవ్ వాటర్–సేవ్ లైఫ్ విధానంతో ప్రాజెక్టు రూపకల్పన చేస్తున్నాను. ఇందు కోసం ప్రభుత్వం రూ.10వేలు ప్రోత్సాహక బహుమతి ప్రకటించింది.

– రియాజ్ హుసేన్, 9వ తరగతి, యాళ్లూరు

కోలుకోలేక యువకుడి మృతి

రుద్రవరం: ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మంగళవారం మృతి చెందాడు. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి వివరాల మేరకు.. మండల పరిధిలోని కొండమాయపల్లెకు చెందిన నరసింహా (29) భార్య కాపురానికి రాలేదన్న మనస్తాపంతో ఈ నెల 11న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటి నుంచి ఆళ్లగడ్డ, నంద్యాల ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



కోటకందుకూరు గ్రామస్తులతో ఎస్పీ

ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగేలా అందరూ సహకరించాలని ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే ఎన్నికల సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రత్యేక పోలీస్ బలగాలకు వసతి కల్పించేందుకు అవసరమైన ప్రాంతాలను పరిశీలించారు. రాత్రి సమస్యాత్మక గ్రామమైన కోటకందుకూరును సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట డీఎస్పీ షర్ఫుద్దీన్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, సీఐలు రమేష్‌బాబు, హనుమంత నాయక్, ఎస్‌ఐ నరసింహులు ఉన్నారు.

ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



హాజరైన పోలీసు అధికారులు

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైందని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ హాల్‌లో ఎన్నికల నిర్వహణపై సెక్టోరల్ అధికారులు, పోలీసు అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. పోలింగ్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సెక్టోరల్ అధికారులు కీలక పాత్ర పోషించాలన్నారు. భారత ఎన్నికల సంఘం సూచించిన హ్యాండ్ బుక్, మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి ఆ మేరకు ఎన్నికల విధులను పాటించాలని సూచించారు. పోలింగ్‌స్టేషన్‌లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉంటే ఆ మేరకు మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవాలన్నారు. అన్ని విషయాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎన్నికలకు విఘాతం కలిగించే వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు.

శిరివెళ్లలో 62 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు

శిరివెళ్ల: సార్వత్రిక ఎన్నికల కోసం మండలంలో 62 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కులశేఖర్ మంగళవారం తెలిపారు. అత్యధికంగా మండల కేంద్రం శిరివెళ్లలో 16, యర్రగుంట్ల 6, గోవిందపల్లె 9, గుంప్రమాన్‌దిన్నె 3, కోటపాడులో 3, బోయలకుంట్ల 3, చెన్నూరు, గంగవరం, గుండంపాడు, వీరారెడ్డిపల్లె, మహాదేవపురంలో రెండు చొప్పున ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే రాజనగరం, వనికినిదిన్నె, వెంకటాపురం, ఇసుకపల్లె, మోత్కలపల్లె, పచ్చర్ల, జీనేపల్లెలో ఒక్కోటి చొప్పున సిద్ధం చేసినట్లు చెప్పారు. మండలంలో మొత్తం 46,939 మంది ఓటర్లు ఉండగా అందులో 23,345 మంది పురుషులు, 23,590 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. నలుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



ముమ్మరంగా పైప్‌లైన్ పనులు

నంద్యాల(అర్బన్): మిట్నాల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారాని అధికారులు చర్యలు తీసుకున్నారు. సోమవారం సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి గుంతనాల వైపు వెళ్లే రహదారిలో చేతి పంపు మోటారు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని నాలుగు ప్రాంతాలకు పైప్‌లైన్ ద్వారా నీరు అందించేందుకు పనులు మొదలుపెట్టారు. గ్రామంలోని తాగునీటి కుంటలు అడుగంటడంతో పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రెండు మూడు రోజుల్లో చేతిపంపు ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఉత్సాహంగా సైన్స్ ఎక్స్‌పో



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్‌జీఓ కాలనీలో ఉన్న గురురాజ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సైన్స్ ఎక్స్‌పో–2024ను నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథులుగా లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రవికృష్ణ, విద్యాసంస్థల డైరెక్టర్ మౌలాలిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా సీవీరామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు 300 ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. మైక్రోస్కోప్ ఆధునిక టెక్నాలజీ, బ్లడ్ గ్రూప్, డెటర్మినేషన్, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్, రైన్‌వాటర్, హార్వెస్టింగ్, వేస్ట్ వాటర్, ప్లాంట్ ప్రొడక్షన్ ఆఫ్ ఎలక్ట్రిక్ ఎనర్జీఫ్రమ్ నేచరల్ రీసోర్స్, తదితర ప్రాజెక్టులను రూపొందించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి



రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం

నంద్యాల(న్యూటౌన్): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం అధ్యక్షుడు సోమన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడుతో కలిసి మాట్లాడారు. కరువు మండలంగా ప్రకటించిన వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రూ.15వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలన్నారు. మార్చి 5వ తేదీ అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణతో రోగాలు దూరం



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల(సిటీ): పారిశుద్ధ్య నిర్వహణతో రోగాలను అరికట్టవచ్చని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయని తెలిపారు. కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేస్తున్నామని.. దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సాయంత్రం వేళల్లో ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఉన్నారు.

నీటి కాలుష్యం జరగకుండా ప్రత్యేక చర్యలు

పట్టణంలోని 23వ వార్డు ఏకలవ్యనగర్‌లో పైప్‌లైన్ లీకేజీతో ఏర్పడిన నీటి కాలుష్యానికి గల కారణాలను మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆరోగ్య సిబ్బందితో అవగాహన కల్పించారు. పట్టణంలో ఎక్కడైనా కాల్వల్లో మంచినీటి పైప్‌లైన్లు వెళుతున్నా.. లీకేజీ ఉన్నా, కల్వర్టుల వద్ద పైప్‌లైన్లు దెబ్బతిన్నా స్థానిక సచివాలయం లేదా మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. వెంటనే చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట డీఈఈ శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

గోస్పాడు: జగనన్న సురక్ష వైద్యశిబిరాలు పేదల ఆరోగ్యానికి భరోసానిస్తున్నాయని ఎంపీడీఓ నాగ అనసూయ, ఎంఈఓ అబ్దుల్‌కరీం అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో మంగళవారం వైద్యులు గోవర్ధన్‌రెడ్డి, ప్రవీన్‌కుమార్, జ్యోతివాణి రెడ్డి, మురళీమనోహర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా స్పెషలిస్టు వైద్యులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. శిబిరంలో 410 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు, ఈసీజీ కూడా చేస్తామని వైద్యులు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న హౌసింగ్ పీడీ

దొర్నిపాడు: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహనిర్మాణాలపై సిబ్బందితో సమీక్షించారు. బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల, దొర్నిపాడు-1, 2, గుండుపాపల, కొండాపురం, క్రిష్టిపాడు, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె గ్రామ సచివాలయ పరిధిలో 600 ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. వీటిలో 382 నిర్మాణాలు పూర్తి కాగా 195 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇంకా 23 మంది లబ్ధిదారులు నిర్మాణాలు మొదలు పెట్టలేదన్నారు. సకాలంలో బిల్లులు మంజూరు చేస్తామని.. లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, హౌసింగ్ ఈఈ శ్రీహరిగోపాల్, డీఈ నాగరాజు, ఏఈ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక గర్భిణి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: కడుపునొప్పి తాళలేక గర్భిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బాచేపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ నరసింహులు వివరాల మేరకు.. దొర్నిపాడుకు చెందిన నడిపి వెంకటసుబ్బయ్య, సుబ్బలక్ష్మమ్మ కుమార్తె సులోచన(19)ను ఏడాది క్రితం ఆళ్లగడ్డ మండలం బాచేపల్లికి చెందిన మనోహర్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో చికిత్స తీసుకుంటోంది. ప్రస్తుతం 8 నెలల గర్భిణీ. కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి సుబ్బలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



హరివరం కుందూనది వద్ద ఏర్పాటు చేసిన మోటార్




నీటిని పట్టుకుంటున్న గ్రామస్తుడు

నీటి సమస్య పరిష్కారం

ఉయ్యాలవాడ: మండలంలోని హరివరం గ్రామంలో తాగునీటి పథకం నిర్వహణకు మండల పరిషత్ నిధుల నుంచి రూ. 2 లక్షలు కేటాయించడంతో నీటి సమస్యకు పరిష్కారం లభించింది. వేసవి కాలం కావడంతో కుందూనదిలో నీటి ప్రవాహం తగ్గింది. నీటి సమస్య తలెత్తే అవకాశం ఉండడంతో ముందస్తుగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ నిధుల ద్వారా కుందూలో ప్రత్యేక పైపులైన్, విద్యుత్ మోటార్ ఏర్పాటు చేసి గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకును నీటితో నింపుతున్నారు. గ్రామంలో కొళాయిలకు నీటి సరఫరా చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ బాబు మంగళవారం తెలిపారు. ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయడంపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట రమణ

నంద్యాల టౌన్: జిల్లా వ్యాప్తంగా మార్చి 3వ తేదీ జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా వైద్యాధికారి వెంకట రమణ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2,34,382 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారని తెలిపారు. వీరందరికీ పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. మార్చి 4, 5 తేదీల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన పిల్లలకు చుక్కలు వేస్తారన్నారు. మార్చి 3న రైల్వేస్టేషన్, బస్టాండ్ల వద్ద శిబిరాలు ఏర్పాటు చేసి చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి ప్రసన్న లక్ష్మీ మాట్లాడుతూ.. మొదటి రోజున జిల్లాలో 1313 బూత్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. 4,5వ తేదీల్లో 2626 బృందాలు ఇంటింటికి తిరిగి పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తారన్నారు. నంద్యాల అర్బన్ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆశ, ఏఎన్‌ఎంలకు జిల్లా వైద్యాధికారి వెంకట రమణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ చుక్కలు వేయాలన్నారు.

దివ్యాంగ పిల్లలకు అభ్యాసన సామగ్రి కిట్లు



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): దివ్యాంగ పిల్లలకు అభ్యాసన సామగ్రి ఎంఆర్ కిట్లను డీఈఓ సుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. కాంపోజిట్ రీజనల్ సెంటర్ నెల్లూరు ఆధ్వర్యంలో దివ్యాంగుల పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. డీఈఓ మాట్లాడుతూ.. మేధోవైకల్యం కలిగిన దివ్యాంగులకు విద్యాసామగ్రి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచి పిల్లలు అభివృద్ధి చెందడానికి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం సీఆర్సీ నెల్లూరు రిహాబిలిటేషన్ అధికారి ప్రవీణ్‌కుమార్ అభ్యాసన సామగ్రి గురించి తల్లిదండ్రులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో వీలిన విద్య సమన్వయకర్త కె.రఘురామిరెడ్డి, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, దామోదర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవ 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, ఆళ్లగడ్డ నందు
EA: 59/2022 in EP: 01/2016 in OS: 13/2013
1. కాసాని ప్రియాంక @ పాదురు ప్రియాంక
2. కాసాని మనీషా @ వల్లూరు మనీష ..Petitioners/ J.Ds 5&6
V/s
సంకీవల్లి చెన్నా రెడ్డి మరియు 5 ఇతరులు ..Respondents/D.Hr/J.Ds 1 to 4&7
4వ రెస్పాండెంట్‌కు నోటీసు
కాసాని గంగాధర రామి రెడ్డి S/o లేట్. వెంకట నారాయణ రెడ్డి, H.No: 1-72, పెద్ద ఎమ్మనూరు గ్రామం, ఉయ్యాలవాడ మండలం, నంద్యాల జిల్లా. (R4)
మహారాజశ్రీ గౌరవ ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు పై పిటిషన్ దారులు, తమపై గౌరవ కోర్టు వారు 19.12.2019వ తేదీన జారీ చేసిన ఎక్స్ పార్టీ ఆర్డరును రద్దు చేయమని పిటిషన్ దాఖలు చేయడమైనది. గౌరవ కోర్టు వారు 4వ రెస్పాండెంట్ అయిన మీకు నోటీసులు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయడమైనది. కావున ఈ విషయమై అక్షేపనలు ఉన్న ఎడల గౌరవ ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ 07-03-2024 తేదీన ఉదయం 10:30గ॥లకు హాజరుఅయ్యి తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు ఈ పిటిషన్ తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
వాయిదా తేదీ: 07-03-2024 (కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ప్రభాకర రెడ్డి.దాట్ల, అడ్వకేటు Cell: 93999 93323
O/o # 7-8-74, నవత ట్రాన్స్పు పోర్టు ప్రక్కన.T.B రోడ్డు, ఆళ్లగడ్డ.